# నిరీక్షణ-విచక్షణ

– జొన్నలగడ్డ శ్యామల, **Hyderabad**

ఉదయాన్నే టీ తాగుతూ న్యూస్ పేపర్ చదవటం నాకు అలవాటు. టైమయింది. టీ రెడీ చేసుకున్నాను. కానీ పేపర్ రాలేదు. దానికోసం నిరీక్షణ. లేస్తూనే నిరీక్షణ. ప్చ్.

అంతలో ముంగిట్లో పేపర్ గిరాటేసిన శబ్దం. ఆత్రంగా పరుగెత్తి పేపరందుకున్నాను.

భోపాల్ తీర్పు.... హెడ్ లైన్స్ ఎన్నో ఏళ్ళ కిందటి విషాదాన్ని మళ్ళీ స్మృతికి తెచ్చాయి.

ఆ.. ఆ రోజు.. భోపాల్ లోని యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ నుంచి అర్ధరాత్రి సమయంలో మిథైల్ ఐసోసైనేడ్ లీకయి దాదాపు 5లక్షలనుంచి 8 లక్షల మంది వరకు ఆ విషప్రభావానికి లోనయి శాపగ్రస్తులయ్యారు. అలాటి ఘోర ప్రమాదానికి సంబంధిచిన కేసులో 23 సంవత్సరాల సుదీర్ఘకాలం గడిచాక ఇప్పుడు భోపాల్ న్యాయస్థానం నిందితులకి స్వల్ప శిక్షలు విధిస్తూ ఓ అన్యాయమైన తీర్పునిచ్చింది. లక్షలమంది న్యాయంకోసం లబోదిబోమంటే అక్కడి న్యాయదేవత కళ్ళతోపాటు చెవులూ మూసేసుకుందా? తీర్పు కోసం 23 సంవత్సరాల నిరీక్షణ. ఇదెక్కడి న్యాయం? మనసంతా వికలమయింది. పేపర్ పక్కన పెట్టి పనులు చేసుకుంటున్నానే గానీ నా ఆలోచనలన్నీ నిరీక్షణ చుట్టే ప్రదక్షిణాలు చేస్తున్నాయి.

అసలు జీవితమంతా ఏదో ఒక నిరీక్షణతోనే గడుస్తుంది.

చిన్నప్పుడు స్కూల్లో సన్నిహితులైన స్నేహితులు రాకపోతే ఆ రోజు చాలా బోర్‌గా అనిపించేది.

ఎప్పుడు సాయంత్రమవుతుందా, ఎప్పుడు బెల్ కొడతారా అని నిరీక్షించేదాన్ని.

ఇంక వేసవి వస్తే సెలవలకోసం నిరీక్షణ.

ఇప్పుడయితే తరం మారి అమ్మలు ఉద్యోగినులు కావడంతో పిల్లలు సెలవుల కోసం నిరీక్షిస్తే, వాళ్ళతో వేగలేని అమ్మలు, స్కూలు తెరిచే తేదీకోసం నిరీక్షించడం మామూలయిపోతోంది. పరీక్షలు బాగా రాసిన విద్యార్థులు ఫలితాలు ఎప్పుడు వస్తాయా అని నిరీక్షిస్తుంటారు.

ప్రయాణమంటే చాలు ట్రాఫిక్ లో ఇరుక్కుపోయి రైలందుకోలేమో అని ముందుగా వెళ్ళటం, ప్లాట్ ఫామ్‌ను పరిశీలిస్తూ, రైలు కోసం నిరీక్షణ. ఇంతా చేసి ".....ఎక్స్ ప్రెస్ అరగంట ఆలస్యముగా వచ్చుచున్నది" అనౌన్సుమెంట్ విని 'హతవిధీ' అనుకోవటం మామూలే. ఒక్కోసారి ఇంటికి వచ్చిన బంధువులామెను రైలెక్కించాలని వచ్చేవారుంటారు. రైలు లేటయినకొద్దీ వారికి చిరాకు పెరిగిపోతుంది. ఆ రైలెప్పుడు వస్తుందో, ఈవిడెప్పుడు వదులుతుందో మనసులో చిటపటలు. కక్కాలేరు, మింగాలేరు. మొక్కుబడి కార్యక్రమాలు కదామరి. ఆప్తులను రిసీవ్ చేసుకోవటానికి వచ్చేవారు ఎప్పుడెప్పుడు రైలొస్తుందా, ఎప్పుడెప్పుడు వారిని చూస్తామా అని ఆత్రంగా నిరీక్షిస్తుంటారు.

క్షణక్షణగండం నూరేళ్ళాయుష్షుగా ఉన్న ఈ రోజుల్లో కుటుంబ సభ్యులు బయటికి వెళ్ళి సకాలంలో ఇంటికి చేరుకోకపోతే ఆందోళనతో కూడిన నిరీక్షణ మొదలవుతుంది. మనసు పరిపరి విధాలపోతుంది. ప్రస్తుతమయితే సెల్ ఫోన్లు వచ్చి ఇటువంటి నిరీక్షణను చాలావరకు తగ్గించాయనే చెప్పాలి. అయినా సెల్ ఫోనుకు చార్జింగు లేక, నెట్ వర్క్ పనిచేయక కొన్ని సందర్భాల్లో ఆందోళనతో కూడిన నిరీక్షణ తప్పటం లేదు. గతంలో బంధువులు దూరప్రాంతాల్లో, విదేశాల్లో ఉంటే ఉత్తరం కోసం కళ్ళుకాయలు కాచేలా నిరీక్షించేవారు. ఇప్పుడు ఫోన్లు, ఈమెయిల్స్, ఛాటింగ్స్ వగైరా వగైరా పద్ధతుల్లో కమ్యూనికేషన్ విస్తృతం కావటంతో ఆ నిరీక్షణ చాలావరకు తప్పింది.

ప్రేమికుల నిరీక్షణ ప్రత్యేకమైంది. ఫలానా చోట, ఫలానా సమయానికి కలుసుకుందామని చెప్పుకున్నాక అమ్మాయి ఆలస్యం చేస్తే అతగాడి విరహం, ఆగ్రహంగా మారుతుంది. అసలు ఆడవాళ్ళను నమ్మనే కూడదనుకుంటాడు. ఆ నిరీక్షణ అతడికి నీరసం తెప్పిస్తుంది. ఆమె రాగానే అలుకబూని ఆగ్రహం ప్రదర్శిస్తాడు. అలా ఓ అరగంట కరిగిపోతుంది. అబ్బాయి ఆలస్యం చేసినా అమ్మాయి డిటో డిటో.

అదే సినిమాల్లో అయితే

"తుషార శీతల సరోవరాన

అనంత నీరవ నిశీధిలోన

ఈ కలువ నిరీక్షణ. . .. నీకోరకే రాజా....వెన్నెల రాజా..." అంటూ అమ్మాయి సాంగందుకుంటుంది.

పెళ్ళయిన కొత్తల్లో శ్రీవారు పిక్చర్ కెళదామనో, షికారుకెళదామనో చెప్పి, తయారై ఉండమని మరీ చెప్పి రాకుంటే శ్రీమతి నిరీక్షించి, నిరీక్షించి విసిగి, వేసారి "రానీ, చెపుతా" అనుకోవటం మామూలే. ఆ తర్వాత...తర్వాత ఇలాటి నిరీక్షణలు...కోపతాపాల ఉద్ధృతి తగ్గుముహం పడుతుందనుకోండి.

ఇలా ఆలోచిస్తూ నా పనులు పూర్తిచేసుకుని బస్ స్టాప్‌కు నడిచా. ఆఫీస్ బస్‌కోసం నిరీక్షిస్తూ నిలుచున్నాను. మళ్ళీ ఆలోచనల సుడిలో చిక్కుకున్నాను.

అనారోగ్య కారణంగా వైద్య పరీక్షలు చేయించుకున్నప్పుడు ఆ రిపోర్టు చూసేదాకా, ఏం రిజల్ట్ వస్తుందో, ఏ పెద్ద జబ్బు బయటపడుతుందో అని మధనపడుతూ రిపోర్టుకోసం ఎదురు చూస్తారు. అంతా నార్మల్ అని తెలిశాక హమ్మయ్య అనుకుంటారు. అలాగే శస్త్రచికిత్స జరిగే సందర్భాలలోను ఆపరేషన్ చేసి డాక్టరు బయటకు వచ్చి, అంతా ఓ.కె. అని చెప్పేదాకా ఆ నిరీక్షణ దుర్భరంగా ఉంటుంది. ఆసుపత్రినుంచి విడుదలయ్యేదాకా అదొక నిరీక్షణ.

తీవ్రమైన జబ్బులతో నరకయాతన పడేవారు మరణం ఎప్పుడు కరుణిస్తుందా అని నిరీక్షిస్తుంటారు.

ఎన్నికల సమయాల్లో ఫలితాలకోసం రాజకీయ నాయకుల నిరీక్షణ యమగా ఉంటుంది. జనం కూడా ఎదురు చూస్తారు కానీ వీరిది కుతూహలంతో కూడిన నిరీక్షణ.

భూమినే నమ్ముకునే రైతన్నలు తొలకరికోసం నిరీక్షిస్తారు. సకాలంలో వర్షాలు పడకుంటే రైతుల కంట కన్నీరే.

తప్పిపోయిన పిల్లలకోసమో, ఇల్లువిడిచి వెళ్ళిన భర్తకోసమో చిరకాలం ఎదురుచూసేవారిది దయనీయమైన నిరీక్షణ.

బస్ వచ్చింది. ఎక్కి కూర్చున్నా ఆలోచన ఆగనంది.

కొంతమంది అర్ధంలేని నిరీక్షణతో కాలం గడుపుతుంటారు. మచ్చుకు చెప్పుకోవాలంటే, ఎవరో జ్యోతిష్కుడు త్వరలో మీ దశ తిరిగిపోతుంది. కుజుడో, గురుడో ఫలాని ఇంట ఉండి మీకు శుభం చేకూరుస్తారు, అంతా బ్రహ్మాండం అని చెపుతాడు. దాంతో అదృష్టదేవత తలుపు తడుతుందని భ్రమిస్తూ, ఊహల్లో విహరిస్తూ, నిష్క్రియగా కాలం గడుపుతారు. అదంతా వట్టిదేనన్న వాస్తవం గుర్తించేసరికి కాలాతీతమవుతుంది. అందువల్ల ఇటువంటి నిరీక్షణలు మానేయటం క్షేమం. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని నిరీక్షించకుండా ఎవరి పని వారు చేసుకుపోతూ ఉండటమే ఉత్తమం. కృషి ఎప్పటికైనా ఫలించి తీరుతుంది.

ఇంకొంతమంది ఎదుటివారిని నిరీక్షింపజేయటంలో ఆనందం పొందుతుంటారు. ఎదైనా ఆఫీసుకు పని నిమిత్తం వెళ్ళామనుకోండి, సదరు వ్యక్తి ఫొన్లో అరగంట సేపు అడ్డమైన చెత్తా మాట్లాడుతూనో, ఇప్పుడే వస్తానంటూ ఏ క్యాంటీనుకో వెళ్ళి ఎంతకూ రాకుండా ఉంటేనో మన నిరీక్షణ దుస్సహంగా ఉంటుంది. అంతా అయ్యాక మరేదో కాగితం పట్టుకురమ్మనో, అసలు ఇంకెవరినో సంప్రదించాలనో చెప్పారనుకోండి, అంతసేపు నిరీక్షింపజేసినందుకు అతగాడిని అర్జెంటుగా శిక్షించాలనిపిస్తుంది. కానీ అది కుదిరేపని కాదనుకోండి.

ఇక పెళ్ళి వ్యవహారాల్లో అయితే కొంతమంది పది సంబంధాలు చూసేసి, ఎవరికీ అమీతుమీ తేల్చి చెప్పక, ఒక సంబంధంతో మరో సంబంధాన్ని బేరీజు వేసుకుంటూ, ఇంకా మంచి సంబంధం వస్తుందేమో అని వారు నిరీక్షిస్తూ, మిగతావారిని నిరీక్షింపజేస్తుంటారు.

అంతా అయ్యాక, ‘సారీ‘ అన్నారనుకోండి, ‘ఆ ముక్కేదో ముందే చెప్పొచ్చుగా‘ అనుకోవటం సహజం.

‘యస్‘ అంటే ‘హమ్మయ్య, నాన్చి నాన్చి ఎట్టకేలకు మంచిముక్క చెప్పారు‘ అనుకుంటారు. ఇలా ఎదుటివారిని నిరీక్షింపజేయటం, విలువైన కాలాన్ని వృథా చేయటం కూడదు గాక కూడదు. సాధ్యమైనంతవరకు ఎవరినీ నిరీక్షింపజేయకూడదు. నిరీక్షణకు సంబంధించి ఈ విచక్షణ పాటించటం ఎంతైనా మంచి లక్షణం అనుకుంటున్నంతలో గమ్యం చేరాను. ఆఫీసు పని గుర్తొచ్చింది. విచక్షణతో నిరీక్షణ తాలూకు ఆలోచనను పక్కకు తప్పించా.

******